

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 జూన్, 2021 సంచిక : 1

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. .......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**

**సాయివాణి**

**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
త్యాగమయ జీవనం .......... 3
ముక్తి-విముక్తి .......... 7
ఆశ్రమ భిక్ష .......... 10
సాయి సేవక్-శ్రీ శివనేశన్ .......... 11
శ్రీ సాయి సచ్చరితము .......... 14
శాశ్వత ధర్మగోప్త .......... 17
సాయిభక్త దాసగణు .......... 20
ఎవరికెవరు ఈ లోకంలో .......... 23
అసలు దారి .......... 28
విన్నపము .......... 31
స్మృత్యాంజలి .......... 32

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



"మనస్థితే మనస్థితి" అన్నారు గురుదేవులు.

ప్రియ సాయి మిత్రులారా,

ఒక పూర్ణిమనాటి రాత్రి పదకొండున్నర గంటల వేళ సత్సంగ సభ్యులం" సాయిధామంలోని ధ్యానమంటపం రాతి మీద కూర్చున్నాం అర్ధ చంద్రాకృతిలో. ఎదురుగా గురుదేవులు. చుట్టూ నిశ్శబ్దం. సన్నని మొలక గాలి అతిమృదువుగా స్పృశించి వెడుతోంది కన్నతల్లి ప్రేమలాగా. మిట్టపల్లాలన్న భేదం లేకుండా పృథివి నిండా కురుస్తోంది వెన్నెల భగవంతుని కరుణలాగా.

"ఎంత బాగుందో వెన్నెల!" అన్నారెవరో.

"మంచి మనిషి మనసులాగా" అన్నారింకెవరో.

"అవును-మనస్థితే మనస్థితి" అన్నారు గురుదేవులు.

"అంటే?" ప్రశ్న. అటుపై వివరణ సాగింది. "మనిషికి మనసే మిత్రుడు-మనసే శత్రువు. మన మనసు మనను ఏ స్థితిలో ఉంచితే మనం ఆ స్థితిలోనే ఉంటాం. ఇది సామాన్య పరిస్థితి. మనసును గుప్పిట నిలుపుకోగలవాడికి ఎదురులేదు. కుప్పిగంతులు, వక్ర మార్గాలు ఉండవు. అహంకారం, వైరం, మాత్సర్యం వంటి అవలక్షణాలేవీ దరిజేరవు. దీన్ని సాధించటం దుస్సాధ్యమే-అంటే కష్టసాధ్యమేగానీ అసాధ్యం మాత్రం కాదు.

అసలు మనస్సంటే ఏమిటి? భావన-ఊహ, ఆలోచన. మనసు మూడు రకాలుగా ఉంటుంది. ఒకటి అదే పనిగా స్రవంతిలా వెళ్లిపోతుంటుంది. రెండవది మధ్య మధ్య ప్రవేశించి 'ఇది తప్పు, దారి తప్పావు' అనో 'రైటే సుమా' అనో అంటుంటుంది. ఇక మూడవది ఇది రెండింటినీ సాక్షీభూతంగా పరిశీలిస్తూ ఉంటుంది. యోగ్యతా యోగ్యతలు గుర్తించగల విభాగం నుండి రిపోర్టు రాగానే మనసు దాని ప్రకారం నడుచుకోవాలి. అప్పుడు మనిషిలో అనుకూల భావాలు, నిర్మలత, ప్రేమ నిండుతాయి. కానీ, మనసులో పరుగులు తీసే భాగం ఉందే-దీనికి దూకుడెక్కువ.

హడావుడిగా దూకుతుంటుంది. దానికి సంయమనం నేర్పడానికే రెండవ భాగం ప్రయత్నిస్తుంటుంది. 'మనసుతోనే మనసును నియంత్రించాలి' - అని గీత అన్న అర్థం యిదే.

**"ఉద్ధరేదాత్మ నాత్మానం నాత్మాన మవ సాదయేత్**
**ఆత్మైవ హ్యాత్మనో బంధు రాత్మైవ రిపురాత్మనః" అన్నది గీత (6-5)**

మానవ సహజ బలహీనతలు అనేకం. అవన్నీ నిరంతరం మనసును వెంటాడుతూనే ఉంటాయి. వీటిని జయించటం కూడా మనసే చెయ్యాలి. స్వాధ్యాయం, మననం, నిరంతర ఆత్మ విచారం (శోధన) యిందుకు బాగా సహకరిస్తాయి. ఇవి లేనివాడు మన సాధన అహంకారానికి దారి తీస్తుంది. 'నేను సాధకుడిని మాత్రమే'నన్న స్థితి నుంచీ 'నేనే సాధకుడిని' అన్న దశకు దిగజారిపోయే ప్రమాదం ఉంది. ఈ దశ వచ్చాక 'పాజిటివ్‌నెస్' అన్నది మాయమైపోతుంది. 'నాకు ఒకరు చెప్పేదేమిటి! నేను ఒకరిని చూచి నేర్చుకొనేదేమిటి!" యిలా అహంకారం ఆకాశం అంత ఎత్తుకు పెరుగుతుంది. ఇక పతనం ప్రారంభమవుతుంది. ఈ అహం ఉన్నంత కాలం మనం భగవంతుని చేరలేము. మనపై ఉన్న ఆవరణ తొలగనిదే భగవంతుడిని సరాసరి ఎలా హత్తుకోగలం? ఈ ఆవరణే మాయ- అహం. దీన్ని తొలగించుకోవటం కోసమే ఋషులు తపస్సులు చేసింది. అది లేని వాడు గనుగనే భగవంతుడిని 'అమాని' అన్నారు విష్ణు సహస్రనామాలలో.

రామకృష్ణానంద స్వాములవారంటారు. "వియ్యమైనా, కయ్యమైనా, నెయ్యమైనా సమస్థాయి వాళ్లతోనే గదా! పరమాత్ముని పొందాలంటే ఆయనతో సమమైన స్థాయికి వెళ్లగలగాలి. అందుచేతనే మనం కూడా అమానులం కావాలి. అహంకార రహితులం కావాలి" అని. పైగా వారొక చక్కని ఉపమానం చెప్పారు. మెతుకు బిరుసుగా, పలుకుగా ఉంటే మనం తినం గదా! మెత్తగా ఉంటేనే తింటాం. అలాగే బిరుసెక్కి ఉన్న శిష్యుడిని గురువు, భక్తుడిని భగవంతుడు పరిహరిస్తారు" అని. అంచేత- అహంకారాన్ని ప్రోది చెయ్యని రీతిలో మన మనసును పొందికగా తీర్చి దిద్దుకోవాలి. అలా చేసుకొని మన స్థితి సరిగా ఉండేలా చూచుకొందాం. ఆ శక్తి మనకు భగవంతుడిచ్చు గాక!





# త్యాగమయ జీవితం-మధురాణి

16వ శతాబ్దంలో రాజస్థాన్‌లోని మేనాడు రాజ్యంలో రాజా రాణా సాంగా ఉండేవాడు. అతని సేనాని చూడావత్‌సింగ్. అతడు 25 సం.ల యువ కుడు. అతడు ఒక అయిదు రోజుల సెలవు మీద తన ఇంటికి వెళ్లాడు. అప్పడే అతడికి వివాహం అవుతుంది. మూడోరోజు తన భార్యతో కలసి ఉద్యానవనంలో కూర్చుని ఉండగా రాజు సైనికుడు అతడి కోసం ఒక లేఖ తెస్తాడు. ఆ లేఖలో ఏముందని మధురాణి అడుగుతుంది. ఆమెనే చదవమని ఆ లేఖ ఇస్తాడు చూడావత్‌సింగ్. ఆమె చదువుతుంది.

'యవనుల సైన్యం దేశం పైకి దండెత్తబోతోంది. నువ్వు వెంటనే బయల్దేరి రాజధానికి రావాలి' అని ఆ లేఖ సారాంశం! ఇంకా రోజులు సమయం ఉంది కదా అని చూడావత్ అంటాడు. అప్పడు మధురాణి అంటుంది.

'మీరు మహా పరాక్రమవంతులనీ, దేశభక్తులనీ, తలచి నా వివాహాన్ని మీతో జరిపించారు. మీకెలాంటి వ్యామోహాలు లేవని కర్తవ్యదీక్షలో ముందుంటారని భావించాను; కానీ మీలో ఆ లక్షణాలు కన్పించడం లేదు' అంది. అప్పడు చూడావత్‌సింగ్ తాను బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నానని చెపుతాడు. మధురాణి అతడికి విజయతిలకం దిద్ది వీడుకోలిస్తుంది.

యవనుల సేనతో భీకర యుద్ధం జరుగుతున్న సమయంలో యుద్ధ భూమిలోకి చూడావత్‌సింగ్ ప్రవేశిస్తాడు. కానీ, ఇతడి మనస్సు నిండా మధురాణి నిండి ఉంటుంది. అతడు ఒక లేఖ మధురాణికి వ్రాసి ఆమెకి అందజేయమని ఒక సైనికుడికి ఇస్తాడు.

దాన్లో అతడు రెండు విషయాలు రాస్తాడు.

1. నేను యుద్ధభూమిలో మరణిస్తే నువ్వేం చేస్తావు?

2. నీకు నా మీద ఉన్న ప్రేమకి గుర్తుగా నాకు ఏదైనా వస్తువు పంపించు.

ఆ లేఖ చూసి మధురాణి విస్మయానికి లోనవుతుంది. అతడి మనస్సు యుద్ధభూమిలో లేదని ఆమెకు అర్థం అవుతుంది. నేను బ్రతికి వుంటే ఇతడు యుద్ధం మీద శ్రద్ధ చూపలేడు అని తలచి అతడికి ఒక లేఖ వ్రాసి ఇస్తుంది. ఒక పళ్లెం సైనికుడికి అందిస్తుంది.

నా భర్త నా ప్రేమకి గుర్తుగా ఏదైనా ఇవ్వమని అడిగాడు. నేనిస్తున్నది అతడికి చేర్చండి అని చెపుతూ సర్రున కరవాలాన్ని దూసి తన శిరస్సు తానే నరుక్కుంటుంది.

ఆ శిరస్సు వెళ్లి ఆ పళ్లెంలో పడుతుంది! నివ్వెరపోయిన ఆ సైనికుడు దాని మీద ఒక వస్త్రాన్ని కప్పి ఆ పళ్లెం తీసుకువెళతాడు.

ఇక్కడ చూడావత్‌సింగ్ తన భార్య ఏమిస్తుందో అని ఎదురుచూస్తున్నాడు. ఇతడిని చూడగానే పరుగున వచ్చి 'నా భార్య ఏమిచ్చింది' అని ఉత్సుకతతో అడుగుతాడు.

ఆమె తన ప్రియ సందేశాన్ని ఇచ్చింది అని సైనికుడు చెపుతాడు! అలా చెపుతూ దాని పైన ఉన్న వస్త్రాన్ని తొలగిస్తాడు. సేనాపతి నివ్వెరపోతాడు. ఇంతగా నేను ప్రేమించిన మనిషి ఇలా ఎందుకు చేసింది అని అడుగుతాడు. సైనికుడు మధురాణి రాసిన ఉత్తరాన్ని చూడావత్ సింగ్‌కు అందజేస్తాడు.

అందులో ఇలా ఉంటుంది....

'నీ మరణం తర్వాత నేనేం చేస్తాననేది అనవసరం. నీ కర్తవ్య పాలన నాకు ముఖ్యం. అందుకోసమే నేను జీవితాన్ని త్యజిస్తున్నాను. నేను బ్రతికి ఉంటే నువ్వు యుద్ధభూమిలో కర్తవ్యపాలన చేయలేవు. అలా చేయకపోతే మనం ఓడిపోతాం. అలా జరిగితే దేశం బానిసగా మారుతుంది. అంత





భయంకరమైన బానిసత్వానికి నేను కారణం కాకూడదు. అందుకే నేనీ నిర్ణయం తీసుకున్నాను. ఇప్పుడు మీరు అన్నీ మరచి యుద్ధం చేయండి. ఇదే మీకు నా ఆఖరి విన్నపం'.

ఇది చదివిన చూడావత్‌సింగ్ ఎడమ చేత్తో ఆమె శిరస్సు, కుడిచేత్తో కరవాలాన్ని పట్టుకుని యుద్ధంలో చెలరేగిపోతాడు. చాలా త్వరగా వారికి విజయం సిద్ధిస్తుంది.

విజయభేరులు మ్రోగుతున్నాయి. రాజస్థాన్‌లో రాణా సంగాకి జయజయ కారాలు మారుమ్రోగాయి.

చూడావత్‌సింగ్ మధురాణి శిరస్సును తీసుకువచ్చి రాణా సంగా చరణాల మీద పెడతాడు. విషయం తెలిసిన అందరూ మధురాణి త్యాగానికి అబ్బురపడుతూ ఆమెకు జయజయకారాలు చేస్తారు. చూడావత్ సింగ్ అక్కడ నుండి వెళ్లిపోతాడు.

ఇక్కడ మధురాణి త్యాగాన్ని గురించి ఇలా చెప్పాలి ....

శరీరస్య గుణానాంచ దూరమత్యంత మంతరమ్

శరీరమ్ క్షణ విధ్వంసీ కల్పాంత స్థాయినో గుణాః

శరీరానికి, గుణాలకీ చాలా అంతరం ఉంటుంది. శరీరం ఏ క్షణమైనా నశిస్తుంది. కానీ గుణాలు అలా కాదు, అవి సృష్టి అంతం వరకూ శాశ్వతంగా నిలచి ఉంటాయి. అందుకే మన ఋషులంటారు - 'అశాశ్వతమైన శరీరాన్ని ఉపయోగించి శాశ్వతమైన గుణాలను పొందాలి' అని.

అదే విధంగా మధురాణి శరీరం లేకపోవచ్చు. కానీ, తన దేశం కోసం ఆమె చేసిన మహోత్యాగం ఈనాటికీ ఆదర్శం, అనుసరణీయం.

# ముక్తి - విముక్తి

**- వల్లూరి శ్రీరామచంద్రమూర్తి**

**(గత సంచిక తరువాయి)**

ఏ సన్నివేశానికి ఏ మాట కావాలో, ఏ మాట వలన మన జీవితయాత్ర సాగుతూ ఉంటుందో ఆ మాట మాట్లాడుతూ వెళ్ళిపోతున్నాం. ఇరవై నాలుగు గంటల్లో ఒక గంట మాత్రమే సత్సంగ విశేషాలు-ఆత్మను గురించి, పరమాత్మని గురించి మాట్లాడుకుంటున్నాం. స్వప్నావస్థలో, జాగ్రదవస్థలో ఏమిటి మాట్లాడుతున్నాం అంటే ప్రాపంచికమే మాట్లాడుతున్నాం ప్రపంచంలో మనం బ్రతకటానికి. ఎన్ని మాటలు అవసరమో, ఎటువంటి మాటలు అవసరమో, ఏ మాటల వలన మనం పనులు సాధించుకో గలుగుతామో, ఇవే మాటలతో మనం నిత్యమూ కూడా మాట అనేటువంటి ఒక క్రియ ద్వారా, ఒక కర్మ ద్వారా జీవయాత్ర సాగిస్తూ వున్నాం. ఈ వాక్కు మనస్సులో నుంచి వచ్చిన ఆలోచన యొక్క స్వరూపమే. మనస్సులో ఆలోచన రాగానే, the thought is getting converted into a word. అంటే ఆ రెండింటి మాతృక, ఒక పుట్టుక, ఒక మూలము ఎక్కడ వున్నది అంటే మళ్లీ మన మనస్సులో వున్నది. ఈ మనస్సు చాలా చంచలమైనది. బైటకు పరిగెత్తిస్తుంది. ఈ పరిగెత్తుతున్న దాన్ని పట్టుకోవాలి అంటే? ఈ సాధకుడు అప్పటికే సచ్చిదా నంద స్థితిలోకి వచ్చాడు. వాడిని మనస్సు బాధించటం లేదు. మనస్సుకి అతీతమైన స్థితిలోకి వెళుతూ వున్నాడు. కానీ, నిలబడటం లేదు. ఇది మనందరికీ కలిగే అనుభవమే. నిన్న రాత్రి స్వామి దర్శనమిచ్చారు. మనకేదో ఒక సలహా ఇచ్చారు. కల అయిపోయింది. ఫలితం పొందినట్లా? పొంద నట్లా? అది సత్యమా? అసత్యమా? సత్యము అని అనుకుంటే మానవుడు కులాసాగా ఉంటాడు. స్వప్నంలో మామిడిపండు తిన్నాం. నిద్ర లేచాము. మామిడిపండు తిన్నట్లా, లేదా అంటే తిన్న ఒక అనుభూతి కలిగిందే తప్ప యదార్థంగా తినలేదు. అలాగే స్వప్నంలో మన ఈ మనస్సు ఏ విధంగా వుండాలి అని కోరుకుం టుందో ఆ విధంగా వున్నది. యద్భావం తద్భవతి. మన అంతరాంతరాల్లో ఎటువంటి ఆలోచనలు మనకి కావాలో, దేనివలన మనకు స్వస్థత కూరుతుందో, దేనివలన మనకు తాత్కాలికమైనప్పటికీ కూడా ఒక ఉప శమనం కలుగుతుందో అటువంటి ఆలోచన మన మనస్సులో పెట్టు కున్నప్పుడు, గురువు కదిలి వస్తాడు. కదిలి వచ్చి ఏం చేస్తాడు? నీవు అంతర్గతంగా ఏమి ఆలోచిస్తున్నావో దానికి అనుగుణంగా జవాబు చెప్పి వెళతాడు. ఏ స్వామి అయినా, ఏ గురువైనా కలలోకి వచ్చి నీవు రేపు చచ్చిపోతావు అని చెప్పాడా? లేదు. 'నేనున్నానంటాడు. నీ ప్రాబ్లమ్స్ అన్నీ నేను చూస్తున్నానంటాడు'. ఎవరన్నారు ఆ మాటంటే ఇలా అంటే బాగుండును అనుకున్న మనమే అనుకున్నాం. ఇట్లా వుంటే బాగుండును అని మనకు ఒక ఆలోచన వచ్చింది. ఆలోచన రాగానే ఈశ్వరుడు వచ్చి నట్లుగా భావన. ఎందుకని? మన ఆలోచనలన్నీ అధోస్థాయి నుంచి మధ్యమస్థాయిలోకి వచ్చినప్పుడు ఇవన్నీ పరమేశ్వరుడికి అన్వయించి పాటిస్తున్నాము. ఒక భజన చేసినా, ఒక కోరిక తీరాలన్నా, ఒక స్వస్థత రావాలన్నా, ఒక ఆర్థిక పరిస్థితి నుంచి బైటపడాలన్నా ఇవన్నీ ఇట్లాగైతే బాగుండునని మనం అనుకుంటున్నాం. ఆయన అవుతుంది అని చెప్తున్నారు. అనుకున్నది మనమే. అవుతుందని అనుకున్నది కూడా మనమే. మరి ఈ రెండింటి మధ్యా ఈశ్వరుడు ఒక స్వప్నావస్థలోనే ఎందుకు చెప్తున్నాడు? జాగ్రదావస్థలో కూడా పిలవాలి కదా! చెప్పాలి కదా అంటే జాగ్రదవస్థలో మనస్సు అహంకరించి వుంటుంది. ఎందుకని? కన్ను తెరవ గానే, జగత్తు బలం మన బలంగా చూస్తాం. జగత్తు స్థితి మన స్థితిగా చూస్తాం. స్వప్నంలో మనం జగత్తు నుండి విడిపోయి వున్నాము. జగత్తుతో మనకు ఏ రకమైన సంబంధం లేదు. మరి ఎవరితో వున్నది అంటే నేను

అనుకున్నటువంటి ఈ శరీరం నిద్రాణమై వున్నదో, దాని లోపల, అటువంటి ప్రకృతి స్వభావంతో వున్న ఒక ఈశ్వరభావన మనకు ఉపశమనాన్ని ఇస్తుంది. ఈ సచ్చిదానంద స్థితిలోకి వెళ్లినటువంటి అనేకమంది గురువుల స్థితి కూడా అంతే.

అందుకే, రమణులను పదేపదే అక్కడికి వెళ్లినవాళ్ళు రమణులను రెండే అడిగారు ఆ రోజుల్లో. ఇప్పటిలా పిల్లవాడి వీసా, ఆడపిల్ల పెళ్లి గురించి గురువును అడగలేదు. సాధకుడు భగవాన్‌ని రెండే అడిగాడు. ఒకటి "నన్ను విముక్తం చేయి" రెండవది "నీ అనుగ్రహం ప్రసాదించు". ఈ రెండూ దాటి ఆయనని ఎవ్వరూ ఏమీ అడగలేదు. "అనుగ్రహం ఇవ్వటానికి ఇదేమీ పదార్థం కాదు. ఎప్పుడూ వున్నది. అర్హత సంపాదించుకుంటే అనుగ్రహం దానంతట అది వస్తుంది" అన్నారు. కానీ, విముక్తం చేయి అన్న దాని మీద మాత్రం ఆయన కాస్త విచారణ చేయించారు. అంటే శంకరాద్వైతంగా, శంకరులు చెప్పిన అద్వైత భావనని ఇంకా చక్కగా విస్తృతం చేస్తూ, దాంట్లో వున్నటువంటి భావనని తనదైనటువంటి ఒక స్వానుభూతితో జోడించి దానిని పరిష్కారం చేసారు. ఎలా చేసారు? నన్ను విముక్తం చెయ్యండి అని అడిగినప్పుడల్లా దేని నుంచి విముక్తం

**(సశేషం)**

## శ్రీ సాయి విద్యాధామం

శ్రీ సాయి విద్యాధామం (సాయిధామం) వారి ఉచిత ఉన్నత పాఠశాల (ఇంగ్లీషు/తెలుగు) (ప్రభుత్వ రికగ్నేషన్ పొందినది) మే 21, 2021, శుక్రవారం రోజున విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినది. వరుసగా 22వ సారి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించటం అందరికీ సంతోషం కలిగినది. పాసైన విద్యార్థు లందరికీ శ్రీ సాయి ఆశీస్సులు లభించాలనీ, పూజ్య గురుదేవుల, మాతాజీల ప్రేమాశీస్సులు కలగాలని కోరుకుంటున్నాము.







# ఆశ్రమ భిక్ష పథకం

# అన్నదాన పథకం



శ్రీ సాయి సేవా సమితి వారి ఆశ్రమం "సాయిధామం"లో అన్నదాన పథకం నడుస్తున్నది. అన్ని దానాల్లోకి అన్నదానం పుణ్యప్రదమని పెద్దలంటారు. శ్రీ సాయికి అన్నదానాలు చాలా ప్రీతిపాత్రం. ఆకలిగొన్న ఎవరికి అన్నం పెట్టినా అది నాకే చెందుతుందని బాబా కంఠోక్తిగా చెప్పారు. తను మాత్రమే వండుకొని తినడం పాపమని గీత చెప్పింది. అన్న దానాన్ని మించిన దానం లేదని అన్ని శాస్త్రాలు అంటున్నాయి. అందుచేత సాయి భక్తులైన వారికి యీ పుణ్యప్రదమైన అవకాశం కల్పించటం కోసం ఈ పథకం రూపొందింపబడింది.

సభ్యత్వంగా రూ.6,116/-లు చెల్లించిన వారు యీ పథకంలో సభ్యులవుతారు. సంవత్సరానికొకసారి చొప్పున వారి పేరిట (వారు కోరిన తేదీన గోత్ర నామాలతో) శ్రీ సాయి అర్చన జరుగుతుంది. అదేరోజు వారి పేరిట ఆశ్రమంలో "భిక్ష" ఏర్పాటు చేయబడుతుంది. దీంట్లో వారు స్వయంగా కూడా పాల్గొనవచ్చు. ఆ రోజు వారిపేరు భోజనశాలలో బోర్డు మీద వ్రాయటం ద్వారా ప్రకటితమవుతుంది. సభ్యత్వపు రుసుము **"శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు"** పేరిట చెక్కుల ద్వారాగానీ, వ్యక్తుల ద్వారా గానీ పంపవచ్చు. సత్సంగాలలోనైనా యివ్వవచ్చు. ఈ పథకంలో చేరేవారు తమ చిరునామా, ఎవరి పేరుమీద జరగాలో వారి వివరాలు, చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్లు కూడా వ్రాసి పంపాలి.

సాయి బంధువులారా,

మీ పిల్లల జన్మదినాల పేరిటో, మీ వివాహ వార్షికోత్సవాల పేరిటో, గతించిపోయిన పెద్దల పేరిటో, మీ గురుదేవుల పేరిటో యీ పథకంలో మీరు భాగస్వాములు కండి. మీకు తెలిసిన వారికి కూడా యీ విషయం తెలియజేయండి. ఆకొన్నవారి కడుపునింపి శ్రీ సాయినాథుల అపార కరుణకు పాత్రులు కండి. చిరునామా సాయివాణిదే.

**- సాయిధామం,**
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్,**
**రామలింగంపల్లి పోస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

సాయితత్వాన్ని సంపూర్ణంగా ఆస్వాదించిన స్వామీజీ "నేను ఓ, న, మః లు మాత్రమే నేర్చుకున్నాను. వాటినే మీకు బోధిస్తున్నాను, ఆ పైన మనం దరినీ నడిపించేవాడు సాయినాథుడే" అని అతి వినయంగా సెలవిచ్చారు. నిరంతరం సాయి తత్వాన్ని షిరిడీలో గురుస్థాన ప్రాంగణములోని మెట్ల క్రింద గల అతి చిన్న గది నుంచి దేశ, విదేశాలలో సహితం వ్యాపింప జేసిన ఘనత మన పూజ్య స్వామీజీది.

బాబా అవతార ప్రత్యేకతను స్వామీజీ ఎంతో విపులంగా వివరించే వారు. ఒక్కొక్క అవతారం ఒక్కొక్క ప్రత్యేకతను కలిగియుండగా కలియుగ మందవతరించిన సాయినాథుని అవతారం అనేక ప్రత్యేకతలను సంతరించుకుందని చెప్పేవారు. సామాన్యులకు సామాన్యుడిగాను, తన నిజమైన భక్తులకు మాత్రము అసమాన్యులుగాను, రామ భక్తులకు రామునిగాను, శివ భక్తులకు ఈశునిగానూ, దత్త భక్తులకు దత్తాత్రేయుని గానూ, ఉత్తమ శిష్యులకు సద్గురువుగాను దర్శనమిచ్చి సర్వ దేవతల సమగ్ర స్వరూపమే శ్రీ సాయినాథుని అవతారమని బోధించేవారు. దీనిని ధృవీకరిస్తూ మధ్యాహ్న హారతిలో శ్రీ మాధవరావు వామనరావు అడ్కర్

**జయా మనీ జైసా భావ తయా తైసా అనుభవ**

**దావిసి దయాఘనా ఐసీ తురీఝ హిమావ తురీఝహి మావ**

**ఆరతి సాయి బాబా ....**

అని స్తుతించాడు. శ్రీ నరసింహ స్వామీజీ సాయినాథ అష్టోత్తర శత నామావళి యందు

**'ఓం శ్రీ కృష్ణ శివ మారుత్యాది రూపాయ నమః'**





అని పేర్కొనటం జరిగింది.

"కుల మతాల కతీతంగా సర్వ మానవాళి సమానమని బోధించిన వారు అనేకమంది కాగా సర్వ ప్రాణకోటి సమానమని చాటి చెప్పటమే గాక సర్వ ప్రాణికోటి యందు తానే ఉన్నానని ఏ ప్రాణికి ఏది సమర్పించినా అది తనకే చెందుతుందని అనేక సందర్భాలలో నిరూపించుటయే సాయినాథుని అవతార విశిష్టత"యని స్వామీజీ వివరించేవారు.

భక్తులు తమ తమ బాధలు నివారించమని తమ ఇష్టదైవాన్ని ప్రార్థిస్తే ఆ దైవం కరుణించి తన భక్తులను బాధా విముక్తులను చేయుట సర్వ సామాన్యమైన విషయం కాగా తన భక్తుల బాధలను తానే భరించి, భక్తుల కర్మఫలాన్ని సమూలంగా నివారించుట సాయినాథుని యొక్క మరొక విశిష్టత. **"నా శరణు జొచ్చి నిష్ఫలంగా మరలిపోయిన వారిని నొక్కరిని చూపించండి"** అన్న సాయి అభయం బాబాకు తన భక్తులయందు గల ప్రేమానురాగాలను స్పష్టం చేస్తోంది. ఇన్ని విలక్షణమైన విశిష్టతలు గల సాయిబాబా సంపూర్ణ కరుణా కటాక్షములు పొందవలెనన్న ఏమి చేయవలె నని స్వామీజీని ప్రశ్నించగా స్వామీజీ ఎంతో ఓర్పుతో అతి విపులంగా వివరించారు. శేజ హారతిలోని **"వైరాగ్యాచా కుంచా ఘేవుని చౌకు ఝాడిలా, బాబా చౌక ఝాడిలా"** అన్న వాక్యాన్ని సరిగా అర్థం చేసుకుని ఆచరిస్తే బాబా యొక్క సంపూర్ణ కరుణా కటాక్షములు పొందగలరనియు, దానిని వివరిస్తూ "సర్వసంగ పరిత్యాగము చేసి, అనగా తనువుని, ధనమును, మనస్సును బాబా సేవకే వినియోగించి దేనిపైనా ఆశాపాశములు లేక సర్వమును త్యజించిన వెనువెంటనే వైరాగ్యప్రాప్తి కలుగుతుంది. అట్టి వైరాగ్యమును చీపురుగా చేసి బాబా శయన స్థలమును శుభ్రపరచుట కుపయోగించితే సాయినాథుని సంపూర్ణ కృపకు పాత్రులగుదురు"ని సెలవిస్తూ "ఇది నేటి ఈ సమాజంలో ఏ ఒక్కరికీ సాధ్యం కాదన్న సంగతి బాబాకు తెలుసుననియు అందుకనే మరెన్నో రీతుల తన కృపను పొంద

వచ్చని అనేక సంఘటనలలో మనందరికీ తెలియపరచెను. **"ఎవ్వరైతే నా కర్పించకుండా ఏమీ భుజించరో వారికి నేను బానిసను" "ఎవ్వరైతే ఎల్లవేళలా నా నామాన్నే స్మరిస్తారో వారికి నేను రుణగ్రస్థుడను, వారి హృదయమే నా నివాసము, వారు నా అంతటి వారు"** అన్న సాయి అభయాన్ని మనం సదా గుర్తుంచుకొని ఆచరిస్తే బాబా ప్రసన్నుడవుతాడు. నవవిధ భక్తులలో దేనినైనను త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే బాబా కరుణిస్తాడు. కష్టార్జితము, న్యాయంగా సంపాదించిన ధనంతో ఎంత చిన్న మొత్తాన్ని దాన, ధర్మాలకు వెచ్చించినా బాబా మెచ్చుకుంటాడు. గర్వాహంకారములతోను, అన్యాయార్జితమైన ధనంతో ఎన్ని సత్కార్యాలు చేసినా ఫలితం శూన్యమే. నేటి తరంవారు నిత్యకృత్యాలకే సమయం చాలటం లేదని, అటువంటప్పుడు సాయి సేవను ఎలా చేయగలమని వాపోతున్నారు. నిత్యం మనకు తెలియకుండానే ఎంతో సమయాన్ని వృధా చేస్తున్నాం, ఆ వృధా సమయాన్ని బాబా సేవకు అంకితం చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా గృహిణులు ఇంటి పనిని ఎంతో చాకచక్యంగాను, యాంత్రికంగాను చేసేస్తారు. వారు వారి పనులు చేసుకుంటూనే బాబా నామ స్మరణ చేసుకుంటే వారి కంటే పుణ్యాత్ములు మరెవ్వరూ ఉండరు. ఈ సృష్టియంతయు బాబాదే. ఆయనది కానిదంటూ ఏమీ లేదు. దీనిని గుర్తెరిగి **"తేరా తుజ్‌కో అర్పణ్ క్యాలాగే మేరా"** (నీది నీకే అర్పిస్తున్నాను నాదేమి లేదు) అన్న భావంతో అర్పించాలి' అప్పడే బాబా మనకు మార్గదర్శియై మన నుద్ధరించునని స్వామీజీ తెలిపెడివారు.

హారతి సమయాలను గురించి ఆయా సమయాల్లో బాబాకు నాలుగు హారతులు ఎందుకు ఇస్తున్నది మన స్వామీజీ ఎంతో వివరంగా తెలియపరిచారు.

ప్రతి నిత్యం అరుణోదయ సమయానికంటే ముందుగానే నిద్ర





మేల్కొంచి కాలకృత్యములు ముగించుకొని **"బాబా నీవే మాకు తల్లి, తండ్రి, గురువు, దైవం, మీ బిడ్డలమైన మమ్ము నీవే కాపాడాలి"** యని బాబా పాదోదకాన్ని స్వీకరించి దినచర్యను ప్రారంభించటానికి నిర్దేశించబడినదే 'కాకడ' హారతి. అధిక సంఖ్యాకులు "కాకడ" హరతి లేక "సుప్రభాత సేవ"ను భగవంతుని మేల్కొలపటానికని భావిస్తారు. కాని ఇది సరియైన అవగాహన కాదు. సాక్షాత్తు ఆ పరబ్రహ్మ అరక్షణమైనా కన్నుమూస్తే ఈ లోకాలన్నీ సమూలంగా నాశనమైపోతాయి. ఈ సుప్రభాత సేవ మనలోని భక్తిని మేల్కొలపటానికని మనం గ్రహించాలి.

మధ్యాహ్న సమయానికి జనులు తమతమ కార్యాలలో సతమతమై అలసి సొలసి, ఆకలితో నకనకలాడిపోతారు. ఇంటిలో వండిన వంటకాలను ఎప్పడు భుజిద్దామా అని ఎదురుచూస్తుంటారు. ఈ సృష్టిలో మనకు లభించేవన్నీ ఆ భగవంతుని సృష్టియేనని మనం గ్రహించాలి. ఆ దేవాధిదేవుడు మనకిచ్చిన వాటికి కృతజ్ఞతా పూర్వకముగా ముందుగా ఆయనకు సమర్పించి ఆ ఉచ్ఛిష్టాన్ని మనం భుజించుట మన కర్తవ్యమని తెలియజేయుటకే 'మధ్యాహ్న హారతి'.

సంధ్యాకాంతుల వేళ రవి అస్తమించే సమయానికి ప్రాణులన్నీ కష్టించి పనిచేసి అలసిపోతాయి. ఆ సమయంలో ప్రతి ప్రాణికి మనశ్శాంతి అవసరము. అట్టి ప్రశాంతత బాబా సన్నిధిలోనే మనకు లభిస్తుందన్న విషయాన్ని మనకు బోధించటానికే 'సాయం హారతి'.

దినచర్యను ముగించుకుని నిద్ర కుపక్రమించే ముందు సాయి నాథునికి మరొక్కసారి ప్రణమిల్లి నిదురలో సహితము చెడు స్వప్నములు రాకుండా కాపాడి సూర్యోదయమునకు ముందే మేల్కొంచి కాకడ హారతికి హాజరయ్యేలాగ చూడమని ప్రార్థించి బాబా ప్రసాదం స్వీకరించాలని తెలుపుటకే 'శేజ హారతి' విశిష్టత.

**(సశేషం)**



# ప్రార్థన



కం. శ్రీ కరి ముఖునిన్ దలచుచు
శ్రీకర మవగను రచనకు శ్రీకారంబున్
సాకారము సాయీశుని
చేకొనగను చేయుచుంటి చేరగ పరమున్. 1

ఆ.వె. విఘ్న నాథ నే నవిఘ్న మంచు నిను ద
లంచి మదిన, నాకలమును చేత
బట్టి వ్రాయ సాయి బాబవు నీవైతి
సాయినాథ నీవె శరణు మాకు. 2

తే.గీ. మాతలకు మాత భగవతీ వాణి మాత
మాదు రచనల మర్మంబు మరుగు బడక
సాయమొనరించ గలయట్టి సవ్యమాత
సాయినాథ నీవె యెపుడు శరణు మాకు. 3

ఆ.వె. బ్రహ్మ విష్ణు శివుల వాసము నీవయ్య
మూడు మూర్తులీవు! ముజ్జగముల
రక్షజేయువాడ! రచన సాగించగా
సాయినాథ నీవె శరణు మాకు. 4

ఆ.వె. రంగరాయ యనెడు రమ్యనామ మొసగె
గురుడు ప్రభువు నాకు గుర్తుగాను
గురుడు వ్రాయమనెను 'గురు సాయి' చరితను
సాయినాథ నీవె శరణు మాకు. 5





తే.గీ. సాయి సచ్చరితము వ్రాయ శక్తి నీయ
మనుచు ప్రార్థించి సాయిని, అడ్డు పెట్ట
కనుచు విఘ్నేశు నొప్పించి, ఆదు కొనగ
మాత వాణికి వందన మందజేసి ... 6

తే.గీ. ప్రత్తి నారాయణాదుల ప్రణతి జేసి
ప్రేమ హేమాడు పంతుకు ప్రీతి మ్రొక్కి
నాదు గురుదేవు చరణంబు నమ్మి కొలచి
సద్గురుడు సాయినాధుని సంస్మరించి ... 7

తే.గీ. ఎక్కిరాల భరద్వాజ కేను మ్రొక్కి
నాదు తల్లిదండ్రులకును నమము జేసి
పెద్ద లందరకును చాల ప్రియము మీర
వందనములతో సత్కార మందజేసి 8

తే.గీ సంస్కృతాంధ్ర కవుల నెల్ల సత్కరించి,
నాదు కులదేవు శేషాద్రి నాధు మ్రొక్కి,
దేవి దేవత లందరి దీవెనలతో
భక్తి చరితగ శ్రీ సాయి పద్య చరిత. 9

తే.గీ. సాయి నాధుని నామది సాక్షి యటుల
నిలిపి వ్రాసెద చరితంబు నివురు దొలగ
సాయి నాధుని జీవిత సత్య మహిమ
జనులకును మేలు నాకును జన్మ దీర. 10



(సశేషం)

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

ఏ మహత్తర సేనాబలమూ లేకపోయినా, రాజులు కాకపోయినా ఆర్యావర్తమంతటా శ్రీకృష్ణ బలరాములు మ్రోయిస్తున్న సాహస విజయ దుందుభి వేదవ్యాసుల వారికి, గర్గాచార్యాది తాపసులకు ఉగ్రసేన, వసుదేవ అక్రూరాది యాదవ గణసంఘ ప్రముఖులకు ధర్మానికి విజయ ధ్వనిగా వినిపించింది. పసిపాపలైనా, పంగుముసలులైనా, పశువులైనా, గోవత్సలైనా, చెట్టూ, లతలూ, ఆకులూ, పూలైనా ఆయన వేణునాదానికి పరవశమై, ఆయన స్పర్శకోసం, లాలింపుకోసం, ఆదరణ కోసం తపించేవి. అలా ఆయన చరాచరాలకు ఆప్తుడైనాడు. ప్రజలలో శ్రీకృష్ణుడు ఆపదాపహర్త, సాక్షాత్తు పరమేశ్వరుడు తానై పుట్టిన కారణజన్ముడనే విశ్వాసం పూర్తిగా నెలకొన్నది. ఆయన నడిచినబాట పవిత్రమైంది. ఆయన మాట దివ్యోపశమనాన్ని కలిగించేది.

వేదవ్యాసుల వారికి శ్రీకృష్ణుని జన్మరహస్యం సాక్షాత్కరించింది. ఆయన సాధుజన రక్షకుడు. దుర్మార్గులను శిక్షించడానికి పుట్టినవాడు. ధర్మ రాజ్యస్థాపన చేయడానికి, ప్రజలను ధర్మమార్గాన నడిపించడానికి, నడిపింపజేయడానికి జన్మించినవాడు. సింహాసనాలను సృష్టించగలడు. రాచరికాలను నిలబెట్టగలడు. క్షాత్రధర్మాన్ని కాపాడగలడు. కాని తానై రాజు కాలేడు. అది యయాతి శాపం. ఆనాడు రాజైతే ధర్మాన్ని నిలబెట్టలేడు కదా! అయినా ఆయన రాజరాజేశ్వరుడు, చరాచరాలను స్పందింప చేయగలవాడు. ధర్మహృదయానికి ప్రతీక.

మరి ధర్మరాజ్య ప్రస్థాపనకు పరికరాలుగా నిలబడగలవారు ఎవరు?





రాజ్య లక్షణాలైన రక్షణ, భరణ వినయాధానాలను జీవితంలో సాక్షాత్కరింప జేయగల క్షాత్రధర్మ పరిత్రాత లెవరు? కృష్ణునికీ, కృష్ణద్వైపాయనుల వారికీ ఆ తపన తప్పలేదు.

వారణావతంలో లాక్షాగృహం నుండి తప్పించుకొన్న కుంతీ పాండవులు అహర్నిశలు రహస్యంగా ప్రయాణించి రాక్షసావర్తానికి చేరుకున్నారు. రాక్షసావర్తంలో భీముడు రాక్షసరాజు హిడింబుణ్ణి సంహరించి అతని చెల్లెలు హిడింబను పెండ్లాడి రాక్షసావర్తానికి రాజైనాడు. వారికి ఘటోత్కచుడు జన్మించాడు. అక్కడ ఏడాదిపాటు గడిపారు. అప్పటికే వారి ఉనికిని గురించి కృష్ణద్వైపాయనునికి, శ్రీకృష్ణునికి తెలిసింది. వారిరువురు ఇచ్చిన సలహాలననుసరించి, ద్రుపద మహారాజుగారి రాజధాని కాంపిల్యానికి బయలుదేరారు. దారిలో భీముడు నరమాంస భక్షకుడైన బకాసురుణ్ణి హతమార్చి ఏకచక్రపురవాసులకు, నిర్భయస్థితిని కల్పించాడు. రాక్షసావర్తంలో నరమాంసాన్ని నిషేధింపజేశాడు. వారికీ నాగులకు మైత్రిని నెలకొల్పాడు.

కాంపిల్యానికి బయలుదేరే దారిలో చిత్రాంగదుడనే గంధర్వుడు వీరితో పోరుకు దిగి, అర్జునునిచే పరాజితుడై, తన వద్ద గల నాలుగు ఉత్తమాశ్వాలను బహూకరించాడు. ఆ గంధర్వుడు వారితో స్నేహం చేసుకొని, ఉత్తమ క్షత్రియ కుటుంబానికి కుల గురువంటూ ఉండాలని నచ్చజెప్పి, ధౌమ్యమహర్షిని కులగురువుగా, పురోహితునిగా స్వీకరించమని హితవు చెప్పాడు.

ధౌమ్యుడు పాండవుల కథ విన్నాడు. వారి గుణశీలాలను ఎందరో తాపసులు ప్రశంసించారు. ఆయన పాండవ పురోహితుడవడానికి అంగీక రించాడు. అక్కడినుండి అందరూ కలిసి కాంపిల్యం చేరుకుని ఒక కులాలుని ఇంట బసచేశారు.

కాంపిల్య ప్రభువు అప్పడే తన కూతురు -యజ్ఞాగ్ని సంభూతమైన కృష్ణకు

స్వయంవరం ప్రకటించాడు. ఆ కృష్ణనే పాంచాలి అని, ద్రౌపది అని, యాజ్ఞసేని అని నేటికీ ప్రపంచం ఆదరంతో స్మరిస్తుంటుంది.

స్వయంవరానికి జరాసంధాది వర్గం, కృష్ణ బలరామాది యాదవులు, దుర్యోధనాదులు, మిగతా దేశదేశాల రాజులు వచ్చారు.

స్వయంవరానికి ఒక మత్స్యయంత్రం ఏర్పాటైంది. క్రింద ఏర్పాటైన నీటితొట్టిలో చూస్తూ పైన గుండ్రంగా తిరిగే యంత్రానికి అమర్చిన చేపను పైకి చూడకుండా పడగొట్టాలి. ఆ ధనస్సు పేరు సింధుర. అలా మత్స్యాన్ని పడగొట్టిన వీరధనుష్కుణ్ణి ద్రౌపది వరిస్తుంది.


ద్రౌపదిని వరించడమంటే కేవలమొక వధువును వరించడమే కాదు. ఆనాటి మహాశక్తిమంతులైన రాజులలో ద్రుపదుని స్థానం హస్తినాపురానికి దీటైనది. ద్రుపదుని వియ్యం బలాబలాల సమీకరణాలను నిర్ణయిస్తుంది. ద్రుపదునికి అల్లుడుగా రానున్న ఆ మహావీరుడూ, ద్రోణాచార్యుని వధ నిమిత్తం జన్మించిన దృష్టద్యుమ్నుడూ ఒక పక్షాన నిలబడాలి. ఆ మత్స్య యంత్రాన్ని ఛేదించడానికి, శిశుపాల, దుర్యోధన, అశ్వత్థామలు ఉబలాటంతో ప్రయత్నించారు. కాని సాధించలేకపోయినారు. జరాసంధుడు ప్రయత్నించనేలేదు. కృష్ణ, బలరాముల సూచనతో యాదవ అతిరథులెవ్వరూ ముందుకు రాలేదు. ద్రుపదుని హృదయాన్ని భయం ఆవరించింది. ఆ యంత్రాన్ని ఛేదించగల వీరుడే లేడా?

పాండవులు ఆ సభలో ఉన్నారని కృష్ణునికి తెలుసు. ఆయన చూపులు సభను వడపోసి చూచాయి. బ్రాహ్మణుల సమూహం మధ్యన వున్న సాధుమూర్తి, ప్రశాంత గంభీరుడు యుధిష్ఠిరుల వారిని పోల్చుకున్నాడు. మహోజ్జ్వల వీరమూర్తి, అనితరోన్నతకాయుడు, సాక్షాత్తూ హిమాలయంలా, జటాధారి భీముడు కనిపించాడు. అద్వితీయ ప్రతాపశిఖిగా ముఖాన వెలుగులు జిమ్ముతూ, కూర్చునే ఓపికా, సహనం లేనట్లు మెలికలు తిరుగుతూ అర్జునుడు కనిపించాడు. అతని వెనుకనే ప్రసన్న పరాక్రమ సౌందర్యనిధులు కవలలు కనిపించారు.

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

వార్తా పత్రికలు రాజకీయ, ప్రజా జీవితానికి సంబంధించిన వార్తలను మాత్రమే ప్రచురిస్తాయి. అటువంటి పరిస్థితులలో శిరిడీ వంటి కుగ్రామంలో ఎటువంటి హంగు, ఆర్భాటం లేకుండా అతి సాధారణ ఫకీరు జీవితం గడిపే సాయిబాబా గురించి దూర ప్రాంతాల వారికి తెలిసే అవకాశమే లేదు. మొదటి రోజులలో అల్పసంఖ్యలలో వచ్చే భక్తులు కూడా శ్రీ సాయి మహిమానుభూతులను గురించి ఆ నోటా ఈ నోటా విని వచ్చారు. తరువాత రోజులలో బాబా మహిమా విశేషాలను దాసగణు కీర్తనల ద్వారా విని, వివిధ ప్రాంతాల నుండి ముఖ్యంగా ముంబాయి ప్రాంతం నుండి భక్తులు విరివిగా వచ్చారు. అలా వచ్చిన భక్తులు బాబా దర్శన భాగ్యాన్ని పొంది, తమ ఇహపర అభ్యున్నతిని సాధించుకోవడంలో దాసగణు-సాయి సంకల్పానుసారంగా నిమిత్తమాత్రుడయ్యాడు.

కానీ, ఈ దృగ్విషయాన్ని పారమార్థిక కోణంలో నిశితంగా పరిశీలిస్తే, అమూల్యమైన ఆధ్యాత్మిక సత్యాలు అవగతమవుతాయి. అదెలాగో చూద్దాం.... "నాతో ఋణానుబంధం కలిగిన భక్తులను వివిధ మిషలతో నా వద్దకు రప్పించుకుంటాను" అని బాబా తరచు అనేవారు.

తమతో జన్మాంతర బంధం కలిగి, తాము ఉద్ధరించాల్సిన భక్తులను, బాబా మాటలతో చెప్పాలంటే **"అల్లా తమకు అప్పగించిన పైసలను"** తమ వద్దకు రప్పించుకోవడంలో-ఆయా భక్తుల సంస్కారాన్ని బట్టి-సద్గురు సామ్రాట్టు అయిన శ్రీ సాయి ఎన్నుకునే మార్గం ఆయనకే ఎరుక! ఉదాహరణకు కాకాసాహెబ్ దీక్షిత్ బాబా దగ్గరకు రావాల్సిన సమయం

ఆసన్నం కాగానే, ఎన్నో ఏళ్ల తరువాత ఆకస్మాత్తుగా నానాసాహెబ్ చందోర్కర్ కలిసి, తనకు బాబా లీలా విశేషాలను వివరించడం జరిగింది. ఆ ప్రేరణతో శిరిడీ వచ్చి, బాబాను దర్శించుకున్న కాకాసాహెబ్, శ్రీ సాయి చరణాలను ఆశ్రయించి తన లౌకిక జీవితానికి తిలోదకాలు ఇచ్చిన విషయం సాయి భక్తులకు విదితమే. అంటే, కాకాసాహెబ్ శిరిడీ ఆగమనానికి బాబా ఎంచుకున్న మాధ్యమం నానాసాహెబ్!

అలాగే, అనేక సమస్యలతో సతమతమవుతూ స్వాంతన కోసం సప్తశృంగీ దేవతను ప్రార్థించిన "వణి" గ్రామంలోని సప్తశృంగీ ఆలయ పూజారి కాకాజీ వైద్యకు, సప్తశృంగీ దేవత కలలో కనిపించి "శిరిడీ సాయిబాబా వద్దకు వెళ్ళు" అని చెప్పడం, "సాయిబాబా ఎవరు? శిరిడీ ఎక్కడ ఉంది" అని కాకాజీ వైద్య ఆతురుడు కావడం, సరిగ్గా ఆ సమయం లోనే మ్రొక్కు తీర్చుకోవడానికై మాధవరావుని బాబా సప్తశృంగీ ఆలయానికి పంపించడం అంతా ఆ సమర్థ సద్గురుని లీలా వినోద కేళి అని మనకు విశదమవుతుంది. మాధవరావుతో కలిసి శిరిడీ వచ్చి బాబాను దర్శించు కున్న కాకాజీవైద్య మనసులో అనిర్వచనీయమైన శాంతి అనుభవం కావ డాన్ని బట్టి చూస్తే, తనను అశాంతికి గురిచేసిన పరిస్థితులు, పరోక్షంగా తన నియోజిత సద్గురువు దర్శనానికి అనుకూలించినవేనని మనకు కూలంకషంగా అర్థమవుతుంది. అంటే, కాకాసాహెబ్ దీక్షిత్ ఆగమనానికి నానాసాహెబ్ నిమిత్తమాత్రుడయితే, కాకాజీ వైద్య విషయంలో ఆ పాత్రను స్వయంగా సప్తశృంగీ దేవత పోషించింది.

రేగే అనే భక్తునికి శ్రీ మహావిష్ణువు స్వప్న దర్శనమిచ్చి బాబా వద్దకు పంపిస్తే, రామ్‌లాల్ అనే భక్తునికి శ్రీ సాయియే స్వయంగా కలలో కనిపించి **"నా వద్దకు రా"** అని పిలిచారు. తరువాత దేవుని పటాలు అమ్మే దుకాణంలో రామ్‌లాల్ బాబా ఫొటోను చూసి, తనకు స్వప్న దర్శనమిచ్చింది ఆయనేనని నిర్ధారించుకొని, ఆ దుకాణదారుని వద్ద





నుండి బాబా గురించిన వివరాలను సేకరించి, శిరిడీ వచ్చి తాను శాశ్వతంగా బాబా వద్ద ఉండిపోయాడు.

ఇక శ్రీ కాశీనాథ్ (ఉపాసనీ) విషయానికి వస్తే తీవ్ర శ్వాసకోశ వ్యాధితో సతమతమవుతూ, ఎన్నో ఔషధోపచారాలు చేసినా ఫలితం కనిపించక పోవడంతో మహాత్ముల ఆశీర్వచనంతోనే వ్యాధి నయమవుతుందని నిర్ధారించుకొని, వ్యాధి నివారణార్థం బాబా దర్శనానికై వచ్చి, దాదాపు రెండున్నర సంవత్సరాలు బాబా ఆజ్ఞతో శిరిడీలో ఉండిపోయాడు. ఆ రెండు న్నర సంవత్సరాల శిరిడీ వాసంతో బాబా అనుగ్రహం వలన ఉపాసనీ ఉన్నత ఆధ్యాత్మిక స్థితులకు ఎదగడం, ఆయనలో గొప్ప సిద్ధులు ప్రకటం కావడం బట్టి చూస్తే ఉపాసనీకి వచ్చిన ఉబ్బసమే తాను బాబా వద్దకు రావడానికి నిమిత్తమాత్రమయింది. అంటే, ఆ ఉబ్బసం కూడా బాబా సంకల్పంలో మరియు అనుగ్రహంలో భాగమే! ఆ విధంగా ఎన్నో మిషలతో బాబా తాము ఉద్ధరించాల్సిన-ఆ రూపంలో ఋణానుబంధంతో బంధించ బడియున్న-భక్తులను తమ వద్దకు రప్పించుకుంటారు. నిజానికి అనంత పరబ్రహ్మకు సగుణ సాకారమూర్తిగా అవతరించిన ప్రతి ఒక్క మహాత్ముని దేహయాత్రలో, తమతో ఋణానుబంధంతో బంధించబడిన భక్తులను ఉద్ధరించే క్రమంలో ఈ చర్యావిధానమే మనకు స్పష్టంగా గోచరమవు తుంది సరే!

దాసగణు కీర్తనల వలనే బాబా భక్తుల సంఖ్య పెరిగింది అనే భావం అణుమాత్రం గానయినా మన మనసులో మెదిలితే, స్పష్టత కోసం సాయి మలచిన మరియు దాసగణు పోషించిన కీర్తనాకారుని పాత్రను ఇంకొంచెం లోతుగా ఆకలనం చేసుకునే ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నంలో ఒక అమూల్యమైన పారమార్థిక పోలిక చటుక్కున స్ఫురిస్తుంది. అదేమిటంటే శ్రీ సాయి యొక్క ఋణానుబంధలహరి అనే దివ్య వేణుగాన ఆలాపనలో శ్రీ సాయి ఆలాపకుడైతే, దాసగణు వేణువు వంటివాడు. **(సశేషం)**

# ఎవరికెవరు ఈ లోకంలో

యౌవనంలో వ్యాపారాన్ని ప్రారంభించిన ఓ పారిశ్రామిక వేత్త అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తాడు. సమాజంలోని లొసుగులన్నీ ఉపయోగించుకొని, తన సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. అప్పటినుంచి సంఘంలో ఆయన హెూదాయే మారిపోయింది. ఆయన దృష్టిలో పడేందుకు, ఆయనను మంచి చేసుకునేందుకు అయినవారు, బంధువులు అపసోపాలు పడేవారు. ఆ పారిశ్రామికవేత్తకు కుక్కలంటే మహాప్రాణం. అదే ప్రీతితో విదేశాల నుంచి ఓ మేలురకం శునకాన్ని తెప్పించుకొని ఆత్మీయంగా పెంచుకునేవాడు. ఆయనను ప్రసన్నం చేసుకొని, ఏదైనా లబ్ధి పొందాలని ఆశించేవాళ్లంతా ఆయన బలహీనత శునకమని తెలుసుకొని, వచ్చినప్పడల్లా దానికి రకరకాల పదార్థాలు తెచ్చిపెట్టేవారు. అలా ఆయనకు దగ్గరవ్వాలని ప్రయత్నించేవారు. ఇలాంటి సమయంలో ఒకానొక దుర్దినం, ఆ కుక్క ప్రమాదవశాత్తూ చనిపోయింది. ఆ రోజు ఆ పారిశ్రామికవేత్త ఇల్లు జాతరలా మారిపోయింది. పరామర్శలతో, పలకరింపులతో తడిసిముద్దయిపోయింది. తన పట్ల వారందరూ కనబరుస్తున్న సానుభూతికి పొంగిపోయాడు; వారు చూపుతున్న ఆత్మీయతలక కదిలిపోయాడు ఆ పారిశ్రామికవేత్త. అలా ఆయనను 'మంచి చేసుకొని' సదరు బంధుజన పరివారమంతా బాగుపడుతూ ఉండేవారు.

కొన్నాళ్లకు ఆ శ్రీమంతుడి ప్రాభవ వైభవాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి; ఆస్తులన్నీ కర్పూరంలా కరిగిపోయాయి. బికారిలా మారిపోయాడు. వ్యాధులతో మంచానపడ్డాడు. కానీ, రాజభోగాలు అనుభవించేటప్పడు కనిపించిన ఒక్కరూ ఇప్పడు ఆయన వైపు తిరిగి చూడటంలేదు. కుక్క చనిపోతేనే చూసిపోవడానికి బారులు తీరిన జనాలలో ఒక్కరు కూడా ఇప్పడు ఆయన మంచిచెడులు తెలుసుకునేందుకు ప్రయత్నించడం లేదు. ఈ ప్రపంచంలో ఆయనొకడు ఉన్నాడని కూడా ఆ జనం మరచిపోయారు. మరో ధనవంతుడి ఇంటి కుక్కల బాగోగులు చూసుకునేందుకు పరుగులు పెడుతూన్నారు. ఇదీ మన నైజం. మిసమిసలాడుతూ పైకి కనిపిస్తున్నా లోలోపల మాత్రం పురుగులతో లుకలుకలాడే మేడిపండు లాంటి పరివారజనం ప్రేమాభిమానాల గుట్టువిప్పతూ ఆది శంకరాచార్యులు తన 'భజ గోవిందం'లో ....

**యావద్విత్తో పార్జనసక్త స్తావన్నిజ పరివారో రక్తః।**

**పశ్చాజ్జీవతి జర్జర దేహే వార్తాంకో2 పిన పృచ్ఛతి గేహే॥**

"ధనాన్ని సంపాదిస్తున్నంత వరకే నీ బంధు మిత్ర పరివార జనం నీ పట్ల అనురాగాన్ని చూపిస్తారు. వార్ధక్యంలో నీ దేహం శిథిలమై శక్తి విహీనమైనప్పడు నీ ఇంట నిన్ను పలకరించేవారు కూడా ఉండరు" అంటూ హెచ్చరిస్తున్నారు.

**ఎవరికి వారే ....:** మోహావేశాలతో మనం పెంచుకుంటున్న మమకారాలు వాస్తవానికి మనల్ని మాయలో పడేస్తున్నాయి. అతి ప్రీతితో, అమాయకత్వంతో అసలు రహస్యాన్ని తెలుసుకోకుండా సంసారంలో పీకల లోతు కూరుకుపోతున్నాం. అలా అని చుట్టూ ఉన్న జనాన్ని చీదరించుకొమ్మనీ కాదు! వారిని ప్రేమించొద్దనీ కాదు! కానీ, వారికీ, మనకూ శాశ్వతాను బంధం ఉందని మాత్రం భ్రమించకూడదు. వారి తోటిదే లోకమని భావించుకోకూడదు.

"భార్యాపుత్రులు, తల్లిదండ్రులు అందరితో కలసిమెలసి ఉండు. అందరికీ సేవ చెయ్యి. అత్యంత ఆత్మీయునిగా వారి పట్ల ప్రవర్తించు. కానీ, మనస్సులో మాత్రం వీరెవ్వరూ నీ వారు కారని ఎరిగి ఉండు. ఇవన్నీ

అనిత్యమేనని తెలుసుకో! భగవంతుని పట్ల భక్తిని అలవరచుకోకుండా సంసారంలో దిగావంటే ఇంకా బంధాల్లో ఇరుక్కుంటావు. ఆపద, దుఃఖం, శోకాలు ఎదురైనప్పుడు మనఃస్థైర్యాన్ని కోల్పోతావు" అనేవారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. ఇలా అప్రమత్తంగా ఉండటమే జీవనధర్మం! దురదృష్టవశాత్తూ మనలో ఇంకా అంతటి వివేకం పొడసూపడం లేదు. బిడ్డల కోసం ఎంత ధనం కూడబెట్టినా వాంఛ తీరదు! పైగా ఒకానొక రోజు శరీరంలో శక్తి ఉడిగిపోయి మంచానపడ్డప్పుడు, ఎవరి కోసమైతే ఈ తనువును గుల్ల చేసుకొని సంపాదించామో, వారు ఏ మాత్రం పట్టించుకోకపోతే దుఃఖపడతారు. అదే మాయ! మనస్సును ఈ బంధాలకు మించిన మరో ప్రపంచం వైపు నడిపించాలి. వాంఛ తీరదు! పైగా ఒకానొక రోజు శరీరంలో శక్తి ఉడిగిపోయి మంచానపడ్డప్పుడు, ఎవరి కోసమైతే ఈ తనువును గుల్ల చేసుకొని సంపాదించామో, వారు ఏ మాత్రం పట్టించుకోకపోతే దుఃఖపడతారు. అదే మాయ! మనస్సును ఈ బంధాలకు మించిన మరో ప్రపంచంవైపు నడిపించాలి.

ఎవరికి వారే అయిన ఈ లోకంలో ఎవరి కోసం మనం ఇన్ని తిప్పలు పడుతున్నామో ప్రశ్నించుకోవాలి. అందుకే జగద్గురువులైన శంకరాచార్యులు 'యావద్విత్తో పార్జనసక్త స్తావన్నిజ పరివారో రక్తః....' అంటున్నారు.

**పాపపుణ్యాలే మన వెంట .... :** ఆధునిక సమాజంలో పుత్రమిత్ర పరివార వ్యామోహం మరింత పెరిగిపోయింది. మిగతావారిని ముంచైనా సరే 'మన వారు' సంపదల్లో, సౌకర్యాల్లో తేలాలని తాపత్రయపడుతున్నారు. నిజానికి 'మనవారంటూ' ఎవరూ లేరని తెలుసుకుంటే అడ్డదారులు తొక్కి అందలాలు ఎక్కే సాహసం ఎవరూ చేయలేరు. పాపాలు చేసి కూడబెట్టిన సొమ్ములో వాటాలు పంచుకునేందుకే పరివారమంతా ముందుంటారు గానీ, పాపాల ఫలితంగా సంక్రమించే కష్టనష్టాల్లో మాత్రం ఏ ఒక్కరూ





భాగస్వాములు కాలేరు. శంకరాచార్యులు నర్మగర్భంగా వివరించిన ఈ భజగోవిందంలోని ఆ నాలుగుపాదాలను స్ఫురింపజేస్తూ భక్త రామదాసు తన 'దాశరథీ శతకం'లో ...

**ఎక్కడ తలిదండ్రి, సుతులెక్కడివారు, కళత్ర బాంధవం**
**బెక్కడ జీవుడెట్టి తనువెత్తిన బుట్టుచు బోవుచున్నవా**
**డొక్కడె, పాపపుణ్యఫల మొందిన నొక్కడె కానరాడు వే**
**రొక్కడు వెంట నంటి, భవమొల్లనయా, కృప జూడవయ్య నీ**
**తక్కరి మాయలందిడక దాశరథీ కరుణా పయోనిధీ ...** అంటారు.

'దశరథరామా! తల్లిదండ్రులు, కొడుకులు, భార్య అనేవారు కాలానుగుణంగా నడుమ వచ్చినవారు. కానీ, శాశ్వతంగా సంబంధం కలిగి ఉండేవారుకాదు. ఎందుచేతనంటే, ఒకడు పుట్టినప్పుడు, మరణించినప్పుడు, పాపపుణ్య ఫలములను అనుభవించేటప్పుడు, తానొక్కడే అగును కానీ, తల్లిదండ్రులు తదితరులు రావడం కానీ, పోవడం కానీ సంభవించదు. కాబట్టి అట్టి వారితో సాంసారిక జీవనం అక్కరలేదు. నీవు నాతో లీలలు, మాయలు చేయక నిజంగా సంసారం నుంచి తప్పించి కాపాడుమా!" అంటూ వేడుకుంటాడు.

**స్వార్థాన్ని వీడితేనే సార్థకత ... :** మీ ద్వారా ఈ ప్రపంచంలోకి ప్రవేశించిన బిడ్డలను అనాథలుగా, అభాగ్యులుగా చేయమని జగద్గురువుల ఉద్దేశం కాదు. కానీ, ఆ పరివారం కోసం కొంత పరిమితిని విధించుకోవడం అవసరం. కూడబెట్టి వారికి అతి భద్రత కల్పించి, వారిని సుకుమారంగా తయారుచేయకండి. సాహసవంతులుగా చేయాలిగానీ, పరాన్నజీవులుగా మార్చకండి. మీ వారిని మించి పరిధిని విస్తరించుకోండి. నిస్వార్థంతో సమాజానికి మన వంతు సేవ చేస్తే, ఆ పుణ్యఫలంగా భగవంతుడు మనల్ని భద్రంగా కాపాడతాడు. కానీ, దురదృష్టవశాత్తూ ఆ రోజుల్లో చాలా వరకు

మన విశాలహృదయాలు కుంచించుకుపోతున్నాయి. మన బిడ్డలు, బంధువులు తప్ప పరాయివారెవరూ మనకు కనిపించడం లేదు. మన కళ్ళ ముందు ఎందరో అనాథ పిల్లలు ఆకలితో అలమటిస్తున్నా, మనం కనికరించడం లేదు; మన పిల్లలకు మాత్రం అజీర్ణం చేసినా సరే, కుక్కి కుక్కి మరీ తినిపిస్తూ ఉంటాం. ఇక ఆ సంకుచితమైన, స్వార్థపూరితమైన చర్యలకు ఫలితాన్ని చివరిరోజుల్లో భగవంతుడు మనకు చూపిస్తాడు. ఒంటరిగా చేసి ఆడిస్తాడు. అందుకే శ్రీమద్భాగవతంలో బలిచక్రవర్తి తన తాత ప్రహ్లాదుడి మాటలను గుర్తుచేసుకుంటూ ....

**చుట్టాలు దొంగలు, సుతులు, ఋణస్థులు, కాంతలు సంసార కారణములు**
**ధనము లస్థిరములు తనువతి చంచల; కార్యార్థు లన్యులు ....**

'చుట్టాలు దొంగలు, కొడుకులు, అప్పులవాళ్ళు, భార్యలు ముక్తిని దూరం చేసేవారు. సంపదలు నిలకడలేనివి, శరీరం స్థిరం కాదు. ఇతరులు తమ ప్రయోజనం కోసమే మన దగ్గరకు వస్తారు ...' అంటాడు. ఇలా స్వార్థపూరిత బంధాలను దాటుకొని విస్తరించినప్పుడే మన జీవితానికీ, శ్రమకూ, సంపాదనకూ సార్థకత. మన సనాతన సాహిత్యంలో, ధార్మిక సారస్వతంలో సాంసారిక మోహపు తెరలను తుంచే ప్రయత్నంలో చాలా కఠినంగా హెచ్చరికలు చేశారు. వారందరికీ కుటుంబ వ్యవస్థపైన నమ్మకం లేక కాదు! దాన్ని నిరసిస్తూ కాదు. కుటుంబం, సంసారం పేరుతో మనిషి తన పరిధిని కుంచించుకుంటూ, స్వార్థపూరితుడిగా మారే ప్రమాదముందని ముందే ఊహించారు. అందుకే ఆ సంకెళ్ళను ఛేదించే లక్ష్యంతో చర్విత చర్వణంగా తమ ప్రగాఢ భావజాలంతో మేల్కొలుపు పాడారు. కేవలం కుటుంబ సంక్షేమమే మీ లక్ష్యం కాకూడదనీ, పారమార్థిక పథం వైపు పయనించాలనీ హితవు పలికారు.





# అసలు దారి!

**- వల్లూరి శ్రీరామచంద్రమూర్తి**

అప్పటికే సర్వ శాస్త్రాలు అధ్యయనం చేయటం పూర్తవుతుంది. ఎందరో గురువులను చూడటం, కలవటం, మాట్లాడటం జరిగిపోతుంది. లోక గురువులు, బోధ గురువులు, వాచక గురువులు, సూచక గురువులు, మోచక గురువులు, నిషిద్ధ గురువులు .... ఇట్లా రకరకాల, వివిధ స్థాయిలలో వున్న గురువులను వినటమూ అయిపోతుంది. అయినా నిజ సాధకుడు ఇంకా పొందవలసింది మిగిలే ఉన్నదనుకుంటాడు. “అసలు”ను అనుభవించే మార్గం కోసం పరితపిస్తుంటాడు. ఎదురుచూస్తుంటాడు. కావలసిన దారి చూపించేవాడు దొరికేదాకా అన్వేషణ కొనసాగిస్తాడు. ఇది నిజసాధకుడి పరిస్థితి.

సాధారణ సాధకుడికి ఇంత శ్రమా లేదు, యాతనా లేదు. దొరికిన గురువుతో, అందుకున్న అనుభవంతో, అర్థమైన బోధతో తృప్తిపడి, అదే అసలు మార్గమని తమ ప్రయాణాన్ని సాగిస్తాడు. లేదా అక్కడే ఆగిపోతాడు. సందేహాలు లేవు, సమాధానాలు అక్కరలేదు. అంతా అలవాటే తప్ప అనుభవం దాకా వెళ్ళటం జరగదు. ఈ స్థాయిలో గురువుదీ పరిమిత పరిధే. సాధకుడిదీ కుంచించుకున్న పరిధే.

నిజసాధకుడికి ఇంకా మార్గం దొరకలేదు. ఎవరు దారి చూపించాలి? ఈ సందర్భమే అతణ్ణి కారణగురువు దగ్గరకు చేరుస్తుంది. సాధకుడు ఇక ఉపదేశాన్ని సందేశాన్ని ఆదేశంగా భావించుకొని తనను తాను విశ్లేషించుకునే పనిలో పడతాడు. అంతశ్శోధన, అంతరంగ సాధన తీవ్రతరం చేసుకుంటాడు. బయట కనపడుతున్న వస్తువులను గురించిన ఆలోచనను నెమ్మదించి తనను తానే ఒక ప్రశ్నగా మార్చుకుంటాడు. ఇదే

మూలాన్వేషణ.

"భగవాన్! ఏదైనా ఉపదేశం ఇవ్వండి" అన్నప్పుడు, "ఏమీ లేదు ఊర కుండండి" అన్నదే ఉపదేశం.

"భగవాన్! ఏ దారిన వెళితే స్వస్థానం చేరుకుంటాను" అన్నప్పుడు, "వచ్చిన దారినే" అన్నది సూటి జవాబు.

"భగవాన్! ఈ ప్రపంచం బాగా చెడిపోయింది. దీన్ని బాగుచేయాలి ఎట్లా?" అన్నప్పుడు,

"ప్రపంచము మంచిదీ కాదు చెడ్డదీ కాదు. అది అంతే. దాని సంగతి కంటే ముందు నిన్ను నీవు తెలుసుకో" అన్నది సూచన.

"భగవాన్! పాపపుణ్యాల సంగతేమిటి?" అన్నప్పుడు, "మనసున్నంత వరకు ఆ రెండు ఉన్నట్లే అనిపిస్తుంది. నిజానికి పాపపుణ్యాలంటూ ఏమీ లేవు" అన్నది స్పష్టమైన జవాబు.

"భగవాన్! భగవంతుడున్నాడా?" అని ప్రశ్నించినపుడు, "భగవంతు డంటే ఎవరు? అదొక ఆంతరంగిక శక్తి; అనంత శాంతి. అసలు ఈ ప్రపంచ మంతా, నీతో సహా, భగవంతుడు కాదా" అన్నదే విస్పష్టమైన వివరణ.

"ధ్యానమంటే ఏమిటి భగవాన్?" అని ఆర్తితో ప్రశ్నించి నప్పుడు, "ఏమీ చేయకపోవటమే ధ్యానం. దేనినైనా అనుకుంటే దాని మూలంలోకి వెళ్లాలి. వెళ్లేదంతా ప్రయత్నమే. ప్రయత్నం ఒక కర్మ. అప్రయత్నమే అసలు ధ్యానం. నీలో నీవుండటమే ధ్యానం" అన్నది భగవాన్ స్పష్టీకరణ.

రమణమార్గమంటే అన్ని మార్గాల మధ్య సమన్వయం. ఆత్మగా ఉండగలిగిన స్థాయికి చేర్చటం దాని పని. ఆత్మ విచారమార్గంలో లేని యోగం లేదు. అన్ని యోగాల సమిష్టి స్థితి అది. ఏది ప్రత్యేకంగా లేదో, అన్నిటికీ ఏది మూలమై ఉన్నదో, అన్నీ తానైనదో అది ఆత్మ. కనుక భక్తి, కర్మ, యోగ, జ్ఞాన అని ప్రపంచంలో స్థూలంగా, సంప్రదాయకంగా చెలా





మణి అవుతున్న యోగాలు మాత్రమే కావు. వీటన్నింటికీ మూలమేమిటో తెలుసుకొని, ఆ మూలంలో నిలకడ చెంది, ఆ మూలమే తానన్న ఎరుకకు దారితీసేదే అసలు దారి.

మూలాన్ని పట్టుకోవటమే కీలకం! ఈ పట్టుకోవటం ఎట్లా?

అన్ని కార్యకలాపాలకు మూలమైన మనసును, శుద్ధ మనస్సుగా తీర్చి దిద్ది, అనుభవాన్ని పొంది, ఎప్పటికప్పుడు ఆ అనుభవాన్ని వదుల్చుకుంటూ, ఆనందాన్ని అనుభవిస్తూ, మనుష్య, మనీషా, గంధర్వ, మానవ గంధర్వ, దేవగంధర్వ, పితృపితా, ప్రజాపితా ఆనందాలను 'నేను'గా అనుభవిస్తూ, కడగా హిరణ్యగర్భానందాన్ని 'అసలు నేను'గా నిలకడ చెందటమే మూలాన్ని పట్టుకోవటం.


**పొందాలనుకోవటంతో ప్రారంభమై, పొందటం వరకు సాగేదంతా ప్రయత్నమే. ప్రయత్నమే అక్కరలేని అప్రయత్నమే సిద్ధి. మధ్యలో జరిగేదంతా సాధనే.**

అసహజంగా జరుగుతున్నదానికి సాధన, అన్వేషణ వంటి పేర్లు పెట్టు కుంటుంటాం. కానీ ఆలోచనకు, ఆలోచనకూ మధ్య కలిగే స్పందనలన్నిం టినీ మూలంలో చేర్చుకోగలిగితే అది ఆత్మవిద్యానుభవం. ఆపైన ఇక చేయవలసినది అంటూ ఏమీ లేదు. అది జీవన్ముక్త స్థితి. అయినా దేహ మున్నంత వరకు సమస్త కార్యకలాపాలు ఉండనే ఉంటాయి.

జీవాత్మభావనలో ఉన్న వాడికి అవి కార్యకలాపాలు.

జీవన్ముక్తుడికి ఈ కార్యకలాపాలన్నీ ఒక సహజస్థితి.

ఇదే రమణులు సూచించిన సూటిదారి.



# విన్నపము

శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు ద్వారా శ్రీ సాయినాథుడు నిర్వహిస్తున్న సేవా మహాయజ్ఞంలో యావత్ సమాజం పాల్గొనాలి. తనువు, మనస్సు, ధనము-ఈ మూడు విధాలుగాను ఎవరికి అవకాశం ఉన్నట్లుగా సహకరించండి. సేవాభావంతో కార్యకర్తలుగా వచ్చిన పని చేయడానికిగానీ, ఆర్థికంగా తోడ్పడటానికిగానీ, ఆశ్రమం ద్వారా నడుస్తున్న అనాథ శిశు మందిరం, అనాథ వృద్ధాశ్రమం, గోశాల (60 ఆవులతో) ఉచిత ఉన్నత పాఠశాల (యు.కె.జి నుండి 10వ తరగతి వరకు - 350 మంది పిల్లలు) మొదలగు సేవా కార్యక్రమాలకై కొంత పైకాన్ని పంపడం ద్వారా కానీ మీ వంతు బాధ్యతను నిర్వర్తించి సాయీశుని కృపకు పాత్రులు కావాలని శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ మీ అందరికీ సవినయంగా తెలియజేస్తున్నది. ఆన్‌లైన్ ద్వారా కూడా పంపించవచ్చు.

అకౌంట్ పేరు - **Sri Sai Seva Samithi Trust**

అకౌంట్ నెంబరు - **62002652136**

**IFSC Code - SBIN0020639**

**SBI Keesara Branch**

**Cell No. : 9440413455, 9848133565**





# స్మృత్యాంజలి



నిత్య కృషీవలుడు, సాహితీవేత్త, మంచి సమాజ సేవకులు, మృదుభాషి, మంచి సాధకులు, ఎవరికైనా సహాయం చేయాలి అని తపించే మంచి వ్యక్తి, సాయిధామం చిరకాల కార్యకర్త, పూజ్య గురుదేవులచే రంగరాయ బిరుదు పొందిన మంచి భక్తులు, శిష్యులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘంలో మంచి కార్యకర్తగా పనిచేసినారు. శ్రీ సాయి సచ్చరిత్రము నిత్య పారాయణ గ్రంథం భక్తి పద్య కావ్యం రచించిన ధన్యజీవి. పిల్లల్లో పిల్లవాడిగా, పెద్దలతో పెద్దవాడై నడుచుకునే మా **మండువ రంగారావుగారు (73 సం.లు) 23.05.2021న** సాయిలో ఐక్యం అయ్యారని తెలియజేయుటకు చింతిస్తున్నాము. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని సాయి నాథుని ప్రార్థిస్తున్నాము. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది సాయివాణి.